# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు రాత్రి 8 గంటలకు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.
- ❖ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.
- ❖ నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ❖ ఉత్తరాంధ్ర జిల్లాలలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ❖ దేశంలో నైరుతి రుతు పవనాల రాకకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం, ఇరుదేశాలు చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం తదితర పరిణామాల నేపథ్యంలో ప్రధానమంత్రి మొదటిసారిగా ఈరోజు రాత్రి 8 గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు

==========================

నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నర్సెస్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన

అయిదుగురు నర్సులకు మొదటిసారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. అనంతరం మంత్రి.. నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైందని, ఎంతో చిత్తశుద్ధితో నిర్వహించాలని పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈ రోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ స్టాఫ్ నర్సులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యంతో పాటు సాంత్వన కలిగిస్తుందని అన్నారు.

==========================

ఉత్తరాంధ్ర జిల్లాలలో ఫార్మా క్లస్టర్, పెట్రో కెమికల్స్, స్టీలు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతీ నియోజకవర్గంలో ఔత్సాహికుల కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

==========================

రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో ఈ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలలో పునరుత్పాదక విద్యుత్ ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే రాయలసీమ ప్రాంతం పునరుత్పాదక విద్యుత్ కు పూర్తి అనుకూలమని మంత్రి అన్నారు. కాగా ప్రజలకు ఛార్జీల భారం కాకుండా విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లుగా ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 24 సెకన్లు)

==========================

ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని చంద్రబాబునాయుడు గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్దరణకు తీసుకావల్సిన చర్యలపై అధికారులతో ఈ రోజు ఆయన అమరావతి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

==========================

వైశాఖ పౌర్ణమి సందర్భంగా విజయవాడలో ఈ రోజు ఇంద్రకీలాద్రి చుట్టూ భక్తులు గిరి ప్రదక్షణ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ వి. కె. శీనా నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఈ కార్యక్రమం సాఫీగా సాగేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

విరామం

==========================

రాష్ట్రంలో సాగునీటి పనులు, నిర్వహణకు సంబంధించి అత్యవసర మరమ్మతుల కోసం 344 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడ నుంచి ఈ రోజు శ్రవణ మాధ్యమం ద్వారా ఆయన సాగునీటి రంగానికి చెందిన అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ కి సాగునీటి వనరులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసిందని అన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తెస్తామని చెప్పారు. స్వల్పకాలిక టెండర్లను పిలిచి ఆ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

==========================

నిర్దేశిత కాల పరిమితిలో తాగు నీటి పనులు పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగు నీటి పరిస్థితిపై గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాలలో తాగు నీటి కొరత ఎక్కడా లేకుండా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

==========================

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి షా తెలిపారు. అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ రోజు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... విపత్తు నిర్వహణలో భాగంగా అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలి అనే దానిపై అవగాహన కల్పించడం ముఖ్యమని అన్నారు.  సన్నద్ధత ప్రణాళికను సమీక్షించేందుకు ఇలాంటి మాక్ డ్రిల్స్ దోహదం చేస్తాయని లక్ష్మీషా తెలిపారు.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుంచి ఇంటర్మీడియట్  అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని  ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కాగా, కర్నూలు జిల్లాలో మొత్తం 52 కేంద్రాలలో మొదటి సంవత్సరం 16 వేల 292 మంది, రెండవ సంవత్సరం 5 వేల 032 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లుగా అధికారులు తెలిపారు.

==========================

ఉన్నతి రుణాల మంజూరు, వసూలులో రాష్ట్రంలోనే పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో ఈ రోజు డీఆర్డీఏ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఉన్నతి రుణాలు మంజూరు 7.75 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా, 8.32 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేయడమే కాకుండా రుణాల వసూలు 99.91 శాతం సాధించామని తెలిపారు.

==========================

విశాఖ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం సింహాచలం ఆలయంలో వైశాఖ పౌర్ణమిని ఈ రోజు ఘనంగా నిర్వహించారు. అర్చకులు సుగంధ ద్రవ్యాలు మిళితం చేసిన సుమారు 125 కిలోలు శ్రీ గంధాన్ని స్వామికి ఈ సందర్భంగా సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో ఉచిత శిక్షణ అందిస్తున్నామని జిల్లా నైపుణ్య సంస్థ అధికారి పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు.

==========================

దేశంలో రేపు నైరుతి పవనాలు ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

==========================